epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 86 | మంగళవారం | 06.08.2024




## జనగామ ఠాణాలో

# ఏం జరుగుతోంది!

న్యాయం కోసం వస్తే అన్యాయం చేస్తున్నరు

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

వరుస వివాదాల్లో జనగామ పీఎస్

సీఐ రఘుపతిరెడ్డిపై లాయర్ల ఆరోపణ

**జనగామ ఠాణాలో** ఏం జరుగుతోంది..? వివిధ కేసుల్లో వచ్చిన బాధితులకు న్యాయం జరుగుతోందా..? పోలీసులు చెబుతున్న ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు అవుతోందా..? అంటే.. లేదనే సమాధానం వస్తోంది. ఇందుకు ఇటీవల కాలంగా జరుగుతున్న వరుస ఘటనలు ఉదాహారణగా చెప్పవచ్చు. కొన్ని రోజులుగా జనగామ పోలీసులపై ఫిర్యాదులు ఎక్కువ అవుతున్నాయి. పోలీసులు న్యాయం కోసం వచ్చే బాధితుల పక్షాన కాకుండా అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. *- మన చౌరాస్తా ప్రతినిధి, జనగామ*

2లో..



## స్వచ్ఛదనం..
# పచ్చదనం

- గ్రామాల్లో విస్తృత ర్యాలీలు
- పాల్గొన్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్

2లో..



## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

4

- గురుకులాల కార్యదర్శి వర్షిణి



## మొక్కలతోనే
# జీవకోటి మనుగడ

4

- వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్




## పారిశుద్ధ్యంపై ప్రజలను
# చైతన్య పర్చాలి

2

- అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్

మన చౌరాస్తా
2
06.08.2024 మంగళవారం
epaper.manachourasta.com



# జనగామ ఠాణాలో అసలేం..
# ఏం జరుగుతోంది!

- న్యాయం కోసం వస్తే అన్యాయం చేస్తున్నరు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు
- సీఐ రఘుపతిరెడ్డిపై వరస ఆరోపణలు




**జనగామ, మన చౌరాస్తా ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని జనగామ పీఎస్‌కు వివిధ సమస్యలపై నిత్యం జనం బారులు తీరుతున్నారు. అయితే ఇందులో ఎంత మందికి తమకు ఆశించిన న్యాయం జరుగుతోందో అనేది లెక్కతేలని ప్రశ్నగానే ఉంటోంది. ఓ కేసుపై పీఎస్‌కు వచ్చారంటే ఇక వారి పని అంతే.. నిత్యం ఠాణా చుట్టూ చెక్కర్లు కొట్టాల్సిందేనని పలువురు వాపోతున్నారు. ఇక మరికొందరైతే పోలీసులు బాధితుల పక్షాన కాకుండా అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా మచ్చుకు కొన్ని ఘటనలు..

### విద్యార్థులను చితకబాదారు...

జనగామకు చెందిన కౌన్సిలర్ దేవరాయ నాగరాజుపై(జూన్‌లో) ఇటీవల ఓ ప్లాట్ విక్రయంలో చీటింగ్ కేసు నమోదు చేశారు. సదరు కౌన్సిలర్ తప్పించుకుని తిరుగుతుండడంలో జనగామ పోలీసులు అతడిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. జూన్ మొదటి వారంలో ఆయన జనగామకు వచ్చినట్టు గుర్తించి పోలీసులు పట్టుకునేందుకు ఆ కౌన్సిలర్ ఇంటికి వెళ్లారు. విషయం తెలుసుకున్న ఆ కౌన్సిలర్ పోలీసులకు చిక్కకుండా పరారీ అయ్యాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న సదరు కౌన్సిలర్ కుమారుడితో పాటు అతడి సోదరుడు మాజీ కౌన్సిలర్ దేవరాయ ఎల్లయ్య కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కౌన్సిలర్ పారిపోయేందుకు వారే కారణమని స్టేషన్‌కు తీసుకొచ్చారు. బట్టలిప్పి విచక్షణ రహితంగా చితకబాదారు. కేసులో తమకు ఎలాంటి సంబంధం లేదని పోలీసుల కాళ్లు పట్టుకుని ఎంత ప్రాధేయపడినా.. వదలలేదని బాధితులు వాపోయారు. ఈ విషయంపై బాధితులు అప్పటి డీసీపీకి ఫిర్యాదు చేశారు.

### భూ అక్రమార్కులకు వత్తాసు..!

జనగామ పోలీసులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు లీడర్లు భూ ఆక్రమణ దారులకు వత్తసు పలుకుతున్నారంటూ జనగామ డీసీసీ కార్యదర్శి చిర్ర హనుమంత్ రెడ్డి ఇటీవల బహిరంగ ఆరోపణలు చేశారు. ఈ మేరకు జులై 20వ తేదీన ప్రెస్‌మీట్ పెట్టి మీడియాకు వెల్లడించారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, అతడి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి తన భూమి ఆక్రమణ చేసేందుకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అయితే దీనిపై జనగామ పీఎస్‌లో ఫిర్యాదు చేసినా తనకు ఎలాంటి న్యాయం జరుగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ రఘుపతిరెడ్డి కావాలనే తాత్సారం చేస్తున్నారంటూ హనుమంత్‌రెడ్డి ఆరోపణలు చేయడం గమనార్హం.

## సీఐని సస్పెండ్ చేయాలి

- న్యాయవాదుల డిమాండ్

తాజాగా ఓ బాధితురాలి కోసం జనగామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులకు చేదు అనుభవం ఎదురైంది. న్యాయం కోసం వెళ్లిన తమపై సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు మూకుమ్మడి దాడి చేశారని న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మీడియాకు ఓ వీడియో రిలీజ్ చేశారు. పట్టణానికి చెందిన ఓ వృద్ధురాలి ప్లాట్ విషయంలో ఈనెల 1న జనగామ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అయితే దానిపై పోలీసులు స్పందించకపోవడంతో తాము ఆ ఫిర్యాదుపై తెలుసుకునేందుకు పీఎస్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో సీఐ రఘుపతిరెడ్డి తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బందితో కలిసి మూకుమ్మడి దాడి చేసి బయటకు వెళ్లగొట్టారని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

### నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

న్యాయవాద దంపతులు అమృతరావు, కవితపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం విధులను బహిష్కరిస్తున్నట్లు జనగామ బార్ అసోసియేషన్ పేర్కొంది. న్యాయవాదులపై దాడికి పాల్పడిన సీఐ రఘుపతిరెడ్డితో పాటు ఎస్సైలు, సిబ్బందిని సస్పెండ్ చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి పేర్కొన్నారు. ఈ విషయంపై జనగామ జిల్లా న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు చెప్పారు. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అన్ని బార్ అసోసియేషన్లు కూడా విధులు బహిష్కరించి సంఘీభావం తెలపాలని కోరారు.



# ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి






– ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలి
– ఘనంగా స్వచ్ఛదనం.. పచ్చదనం
– జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని ప్రతి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం జనగామ జిల్లాలో కలెక్టర్ ఘనంగా ప్రారంభించారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రతను, పచ్చదనాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం ద్వారా చర్యలు చేపట్టారు. ఐదు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం ద్వారా ప్రణాళికాబద్ధంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. 'నా గ్రామం .. నా గౌరవం' అనే నినాదంతో పారిశుద్ధ్య, వనమహోత్సవ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలోని యశ్వంతాపూర్ పంచాయతీ పరిధిలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, విద్యార్థులు, గ్రామ ప్రజలతో మమేకమై డప్పుదరువుల నడుమ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జనగామ మండలం శామీర్‌పేట పంచాయతీలో పారిశుద్ధ్యం, శ్రమదానం కార్యక్రమాలు చేపట్టి, గ్రామ ప్రజలతో సమావేశమై మాట్లాడారు. చాయతీల ద్వారా వీధి కుక్కలను గుర్తించి, వాటిని పట్టుకొని, యానిమల్ వెల్ఫేర్ యాక్ట్ ప్రకారం, నిబంధనలను అనుసరిస్తూ వాటికి రేబీస్ వ్యాక్సిన్ ఇస్తున్నట్లు, వీధి కుక్కల జనన నియంత్రణకు ఆపరేషన్స్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని, కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ గ్రామానికి వచ్చినందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ స్వరూప, ఇంచార్జీ జెడ్పీ సీఈవో సరిత, డీఎంఓ నరేందర్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై ప్రజలను
## చైతన్య పరచాలి

### అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పరిశుభ్రతపై అవగాహన పరచాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ కోరారు. ఐదు రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాల ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్లులో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. చైతన్య కొరకు చేపట్టే ఏ కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యం ఉంటేనే విజయవంతం అవుతుందన్నారు. పారిశుద్ధ్యం మెరుగుతో సీజనల్ వ్యాధులు తొలగిపోతాయని తెలియన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు




Local News



# అండగా ఉంటా.. అధైర్య పడకండి

## పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**జనగామ /చేర్యాల, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జిల్లాలోని పలువురి కుటుంబాలను సోమవారం పరామర్శించారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఓం సాయి గార్డెన్ ఓనర్ తాళ్ల పల్లి నాగరాజు కుమార్తె గత వారం రోజులు కింద ఉత్తరప్రదేశ్ లోని అయోధ్య దర్శనానికి వెళ్లి సరయూ నదిలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దుఃఖంలో ఉన్న వారి కుటుంబాన్ని ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావెల రవి మాతృమూర్తి రావేల పద్మ ఇటీవల కన్నుమూయగా వారి కుటుంబాన్ని కూడా పల్లా పరామర్శించారు. అనంతరం మహిళా ఎమ్మెల్యేలని కించపరిచి మాట్లాడిన రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో గాయపడిన గంగభవానిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ పోకల జమున, పట్టణ అధ్యక్షుడు టి.సురేష్ రెడ్డి, కౌన్సిలర్లు ఎం.దయాకర్, బాల్దె కమలమ్మతో పాటు సోషల్ మీడియా ఇంచార్జి రాజ్‌కుమార్ ఉన్నారు. ఇక చేర్యాల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు, వీరన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్ తల్లి వల్లూరి సాయమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, మాజీ ఎంపీపీ పుల్లంపల్లి కరుణాకర్, మాజీ ఎంపీటీసీ శివశంకర్ గౌడ్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పెడతాల ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.





# శివనామ స్మరణతో మార్మోగిన సోమన్న ఆలయం



**పాలకుర్తి, మన చౌరాస్తా :** శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం శ్రావణ మాసం మొదటి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**1.97 కేజీల వెండి గంగాళం, చెంబు సమర్పణ**

శ్రీసోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామికి సుమారు 1.97 కేజీల మిశ్రమ వెండి చిన్న గంగాళం, వెండ చెంబును భక్తులు సమర్పించినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. సోమవారం మహబూబాద్ జిల్లా కేంద్రానికి చెందిన భక్తులు రాయపాటి వెంకట్ రెడ్డి, వనజ దంపతులు స్వామివారికి సుమారు రూ.1,12,000 విలువైన వెండి వస్తువులు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి

- డీసీసీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి
- కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా, మండల, పట్టణ కమిటీల నియామకం
- జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా కళావతి



**మన, చౌరాస్తా చేర్యాల :** పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ జనగామ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ సిద్దిపేట జిల్లా మహిళా కమిటీని ఎంపిక చేయగా ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి హాజరయ్యారు. ఈ మేరకు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలిగా దాసరి కళావతి, ప్రధాన కార్యదర్శిగా తోళ్ల రాజేశ్వరి, మహిళా కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా నాగిళ్ల భాగ్యలను నియమించిన అనంతరం చేర్యాల మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రేకులపల్లి విజయలక్ష్మి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వంగ జయరెడ్డిని నియమించిన కొమ్మూరి వారికి నియామక పత్రాలను అందజేశారు. మహిళా కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి చేయాలని, పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నూతన కమిటీకి సూచించారు. తమ నియమకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



# కుమార్‌గౌడ్ సన్మానం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రఘునాథపల్లి మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్‌ను తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆయన నివాసంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో జనగామ ఏఎంసీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్ కుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శివరాత్రి రాజు, రఘునాథపల్లి మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జీ జోగు శ్రీకాంత్, మాజీ వార్డ్ నెంబర్ కొండ అశోక్, గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు పండుగ ప్రేమ్ కుమార్, సుద్దాల నాగరాజు, సుద్దాల నరేష్, గ్రామ శాఖ యూత్ ఉపాధ్యక్షులు దొరోగొల్ల మధు, కొండ ఉదయ్, జోగు రాజు, రబ్బాని, కాసర్ల నారాయణ, ఉప్పరి కుమార్, నూనె గణేష్, బాబర్, నిమ్మల సారయ్య పాల్గొన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉండాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కొమురవెల్లి ఎస్ ఐ రాజు గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని అయినాపూర్ గ్రామపంచాయతీ వద్ద సైబర్ క్రైమ్, డ్రగ్స్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మహిళల పట్ల దురుసు ప్రవర్తన, మద్యం తాగి వాహనాలు నడపటం, హెల్మెట్ వాడకం లాంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఎస్సీ వర్గీకరణపై అభ్యంతరాలు

**జనగామ, మన చౌరాస్తా :** ఎస్సీ వర్గీకరణపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జి తాటి కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు పింకేశ్ కుమార్‌ను కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై పలు అభ్యంతరాలు ఉన్న దృష్ట్యా ఆ అభ్యంతరాలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మాల నేతలు గునుగంటి నరేష్, గద్ద సాయి, గునుగంటి చంద్రశేఖర్, మద్దెల కార్తీక్, శెట్టి శ్రీనివాస్, గుణుగంటి నర్సింగ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## జీవకోటి మనుగడకు
# మొక్కలే ఆధారం

- వెస్ట్ జోన్ డీసీసీ రాజమహేంద్రనాయక్

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని, జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వెయ్యి మొక్కలు నాటాలని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా సోమవారం జిల్లాలోని రఘునాథపల్లి పీఎస్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యత మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ, రఘునాథపల్లి ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది వీరన్న, యుగంధర్, కవిత పాల్గొన్నారు.





## మార్బుల్ టైల్స్ అండ్ పాలిష్
# పట్టణ కమిటీ ఎన్నిక

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ మార్బుల్ టైల్స్ అండ్ పాలిష్ కార్మిక సంఘం జనగామ పట్టణ కమిటీ సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎండి భాష, అధ్యక్షుడిగా పర్ష సిద్దేశ్, ఉపాధ్యక్షుడిగా సిహెచ్ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా రంగు రాజు, కార్యదర్శిగా ఎండీ.అజామ్, కోశాధికారిగా ఎండీ. రజాక్, దండం పరమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ.హరిబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సిద్దేశ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం కోసం పనిచేస్తానని పేర్కొన్నారు.



# ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపారాణి

**చేర్యాల, మన చౌరాస్తా :** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి అన్నారు. స్వచ్ఛధనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే స్వచ్ఛ మున్సిపాలిటీగా చేర్యాల నిలుస్తుందని అన్నారు. తడి పొడి చెత్తను వేరుచేయాలని, ప్లాస్టికును నిర్మూలించాలని అన్నారు. అనంతరం స్థానిక బాలికల హైస్కూల్ లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పశ్చిమడ్ల సతీష్, యాట కనకవ్వ యాదగిరి, ఆడెపు నరేందర్, చెవిటి లింగం, తుమ్మలపల్లి లీల, మేనేజర్ ప్రభాకర్, కృష్ణ,ఆర్పీలు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

- గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి వర్షిణి



**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ముందుగా జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషాతో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి, మొక్కను నాటారు. తరవాత విద్యార్థులకు ఎలాంటి భోజనం వండి పెడుతున్నారని .. వంట గది, సామాన్ల గది.. అందులో వాడుతున్న సామాగ్రిని పరిశీలించారు. వంట చేసే దగ్గర ఎలాంటి పరిశుభ్రత పాటిస్తున్నారని చూశారు. తరగతి గదులను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అందించే ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులతో సమావేశమయ్యారు. వారితో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చదువుల్లో చక్కగా రాణించాలని చెప్పి.. వారికి పుస్తకాలు బహుమతిగా ఇచ్చారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా నాగేందర్




**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.నాగేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూప రాణి, వైస్ చైర్మెన్ రాజీవ్ కుమార్ రెడ్డి తో పాటు కౌన్సిలర్లు ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం కమిషనర్ నాగేందర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సిబ్బంది సహకరించాలని కోరారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అందరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

# బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి




**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జనగామ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ గా ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని చెప్పారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి కలవచ్చు అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో సేవలందిస్తాననిచ, శాంతి భద్రతల విషయంలో అందరు సహకరించాలని ఆయన కోరారు.

WANTED విలేకరులు కావలెను




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

మన చౌరాస్తా
02.08.2024 శుక్రవారం

# అదరగొట్టిన మిల్కీ బ్యూటీ

మన చౌరాస్తా, సినిమా : టాలీవుడ్ హీరోయిన్ తమన్నా ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో చాలా బిజీగా ఉంటుంది. తెలుగుతోపాటు అటు హిందీలోనూ వరుస ఆఫర్స్ అందుకుంటుంది. వెండితెరపైనే కాకుండా ఓటీటీలోనూ సత్తా చాటుతుంది. ఓ వైపు కథానాయికగా.. మరోవైపు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోపాటు వెబ్ సిరీస్ అంటూ తెగ హడావిడి చేస్తున్న తమన్నా.. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్ అదరగొట్టేసింది. ఇన్నాళ్లు తెలుగులో పలు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా అలరించిన తమన్నా.. కేజీఎఫ్, జైలర్ వంటి హిట్ చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ అదరగొట్టింది. ఇప్పుడు బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ మూవీ స్త్రీ 2లో మిల్కీబ్యూటీ గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చింది. తాజాగా స్త్రీ 2 నుంచి తమన్నా స్పెషల్ సాంగ్ రిలీజ్ చేయగా.. అందరి దృష్టిని ఆకర్షించింది. ఇందులో తమన్నా డాన్స్ చూసి అడియన్స్ ఫిదా అవుతున్నారు. బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావ్, అపరశక్తి ఖురానా, అభిషేక్ బెనర్జీ, పంకజ్ త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఆగస్ట్ 15న విడుదల కానుంది. 2018లో వచ్చిన సూపర్ హిట్ స్త్రీ సినిమాకు సీక్వెల్ గా ఈ మూవీని రూపొందించారు. స్త్రీ సినిమాలో బీటౌన్ బ్యూటీ నోరా ఫతేహి స్పెషల్ సాంగ్ చేయగా.. ఇప్పుడు ఆ సీక్వెల్‌లో తమన్నా భాటియాకు అవకాశం వచ్చింది. అమర్ కౌశిక్ 'స్త్రీ 2' చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి దినేష్ విజన్ నిర్మాతగా వ్యవహరించగా.. కొన్ని రోజులుగా ప్రమోషన్స్ భారీగా జరుగుతున్నాయి. ఆరేళ్ల క్రితం స్త్రీ సినిమా సూపర్ హిట్ కావడంతో స్త్రీ 2పై మరింత హైప్ పెరిగింది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ మూవీపై మరిన్ని అంచనాలు పెంచగా.. ఇప్పుడు విడుదలైన స్పెషల్ సాంగ్ ఆకట్టుకుంటుంది. యూట్యూబ్ లో మిలియన్స్ కొద్దీ వ్యూస్ రాబట్టింది. గతంలో జైలర్ సినిమాలోని తమన్నా చేసిన కావాలయ్యా పాట కూడా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే.

ఆగస్టు 31లోగా

# సీఎంఆర్‌ను పూర్తి చేయాలి